# 1. దారిపక్క దీపాలు

"సూడే లచ్చీ, సూడు... ఆ బాబు కదులు తున్నట్లున్నాడు..."

నిజంగానే శేఖరం కదలడానికి ప్రయత్నించాడు. ఆ ప్రయత్నంలోనే నులక మంచం కిరకిర లాడింది.

కళ్ళు తెరచి చూడాలని కొన్ని క్షణాలపాటు విపరీతంగా ప్రయత్నిస్తే తప్ప సఫలుడు కాలేక పోయాడు.

మసక బారి అద్దం వెనుక దృశ్యంలా అంతా అస్పష్టంగా కనిపించ సాగిందతనికి. చిరు చీకటిలా, నీడల మాదిరి అస్పష్టంగా, ఒక రిద్దరు మనుషులు... పైకి చూస్తే అలికేసినట్లు గుడిసె కప్పు.

నీరసంగా మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు శేఖరం.

పై కప్పు నుంచి వర్షపు నీరు బొట్లు బొట్లుగా – సూటిగా అతని గుండెల మీద పడుతోంది. వాటిలోని చల్లదనమూ, కఠినత్వమూ ఏ మాత్రమూ భరించలేనట్లతని శరీరం ఆపాద మస్తకమూ వణుకుతూంది.

కనురెప్పలను గట్టిగా మూసుకున్నాడతను.

శరీరమంతా చితక గొట్టినట్లు నజ్జు నజ్జుగా వుంది. గుండెల్లో ఏదో చెప్పాలని వుందతనికి. కాని... చెప్పలేక పోతున్నాడు!

గుడిసె కవతల ... హోరుమంటూ గాలి... భోరుమంటూ వర్షం...

ఉధృతంగా కురుస్తున్న వర్షపు ధాటికి ఆగలేక కాబోలు గుడిసెకప్పు చిల్లులు పడింది. మంచులా చల్లగా, శూలాల్లా వాడిగా – నీటిబొట్లు అతని గుండెల మీదబడి చితికి చెదిరి పోతున్నయ్. అతను గజగజ వణికి పోతున్నాడు.

కరచరణాలను కదపగలిగే ఓపిక లేకపోయినా అతని మెదడు మాత్రం దేనికోసమో గింజుకుంటూంది. జ్ఞాపకాలను తవ్వుకుందుకు అవిరళంగా పనిచేస్తోంది.

ఏనుగు తొండాల వంటి వర్షధారలు ! వాటి కర్కశ ధ్వనులు..

అవును. వర్షం ... భయంకరమైన వర్షం. ప్రాణాంతకమైన వర్షపాతం...

జ్ఞాపకం వస్తోంది... మెల్లగా... లీలగా...

సాయంత్రం... శ్యామలతో మాట్లాడాక... ఏకాంతం కోరుకుని ఊరిబయట చిట్టడవి వైపు

కారులో షికారుకు వచ్చాడు. రోడ్డు ప్రక్క కారును వదిలి ఆలోచనలలో అడవివంక అన్య మనస్కంగా అడుగులు వేయసాగాడు.

గాలి రేగింది... సుడిగాలి చెలరేగింది... కన్నులలో దుమ్ము పడింది. మండుతున్న కన్నులను తుడుచుకోవాలనుకుంటూండగానే...ఆకాశంలో సఖ్యం కట్టిన కారుమబ్బులు – చల్లగాలులకు కరగిపోతూ హర్షంతో వర్షించడం మొదలు పెట్టాయి. శ్యామలకు నచ్చే బట్టలు తడిసి పాడైపోతాయేమో అన్న భయంతో... ముందు చూపు లేకుండా పరుగెత్త సాగాడు. అడ్డు త్రోవలో కారును చేరుకోవాలన్న ఆత్రుతలో పరుగెడుతూంటే జోళ్ళు ఊడిపోయాయ్. అయినా లెక్కచేయకుండా అడుగు సారించేంతలో – అరికాలులో కసిగా గ్రుచ్చుకుంది తుమ్మముల్లు. లాగి పారెయ్యాలనుకుంటూ ప్రక్కనున్న చెట్టు దిగువకు చేరుకున్నాడు.

విసురుగా వీస్తూంది గాలి... శపిస్తున్నట్లు కురుస్తోంది వర్షం... దూరంగా కనిపిస్తోంది తన కారు.

ఎక్కడో – విరిగి పడటానికి విచారిస్తున్నట్లు చెట్టు చేస్తున్న ఫెళఫెళా రావం.

భయంగా... ఆలోచనా రహితంగా... ప్రాణ రక్షణకోసం అడుగు ముందుకు వేశాడు. అంతే... తనపై మోయలేని భారం పడింది.

కన్నులముందు కాటుక రాసులవంటి కటిక చీకటి ఆవరించుకుంది. నేలమీద వాలిపోతున్నాడు తను.

అమ్మా అన్న కేక... అంతే.... తరువాత ఏం జరిగిందో తనకు తెలియదు.

"అబ్బా!" మూలిగాడు శేఖరం బాధ భరించలేనట్లు.

"బాబూ!" పరుగెత్తుకొచ్చింది లచ్చి – శేఖరం పడుకున్న మంచం దగ్గరకి.

"దా... హం..." సర్వశక్తులనూ కూడ గట్టుకుని అస్పష్టంగా గొణిగాడు శేఖరం.

కుండలోంచి నీళ్ళు తెచ్చి పెదవుల కందించింది.

మంచుకంటె చల్లగా వున్న ఆ నీరు ఒక్క చుక్కయినా గొంతు దిగలేదతనికి. గుటక వేయాలని శాయశక్తులా ప్రయత్నించి ఓడిపోయాక దీనంగా ఆమె కన్నులలోకి చూశాడతను.

"చన్నీళ్ళు... గొంతు దిగడం లేదు మావా..."

"అవునే మరి... యీ వర్షంలో వేడిగా ఏ కాఫీయో అయితే గొంతుకలో కెడుతుంది గానీ చన్నీళ్లెలా దిగుతాయే?"

"మరిప్పుడేటి సేయడం మావా?" బేలగా అడిగింది లచ్చి.

"నువ్వే సెప్పవే... నిన్నటి నుంచీ ఒకటే వాన. పాడువాన... ప్రళయ మొచ్చేస్తది కాబోలు ప్రెపంచ కానికీ..."

బుర్ర గోక్కుంటూ వెంకాయ్ నులక మంచం దిశగా చూసేడు. రెండంగలు వేసి అంతవరకూ తను కప్పుకున్న గోనె పరదాను శేఖరం గుండెల మీద పరచి – "చూరు నుంచి నీళ్లు పడుతున్నాయ్! కలవారి బాబు... కష్టమెరుగని బాబు... చలికెలా వణుకుతున్నాడో చూడవే. కాస్త కాక చేస్తే కోలుకుని కన్ను తెరుస్తాడేమో

"అగ్గిపెట్టి ఏడనుంది మావ?" మూలనున్న కొబ్బరిపీచూ, ఎండు గడ్డీ కలిపి పట్టుకొచ్చి అడిగింది లచ్చి. మొలలోంచి అగ్గిపెట్టె తీసి అందించాడు వెంకాయ్.

అగ్గిపుల్ల గీసింది లచ్చి. చుర్రుమని శబ్దమొచ్చిందే తప్ప వెలగనే లేదు !

"ఏమే, నీకేవైంది? ఏటలా సూస్తవ్ బిత్తర పోతూ?"

"ఇక ఒక్కటే అగ్గిపుల్లుంది మావా. నాని పోయింది... యిది కూడా యెలుగుతాదన్న నమ్మకం లేదు మావా..."

"ఎలాగయినా అగ్గి ముట్టించి తీరాలే. కాక తగలక పోతే యీ బాబు కన్ను తెరచేలా లేదు."

" ఇది కూడా యెలగక పోతే ఏం చేయడం మావా?"

"అన్నింటికీ ఆ భగమంతుడే ఉన్నాడు లేవే... మనం సెయ్య గలిగింది సేసిచూద్దాం. నువ్విలా గాలికడ్డవొచ్చి – నీ చీర కొంగు తెర చాపలా అడ్డంపట్టు. నేను పుల్లగీస్తాను. పాడుగాలి... ప్రాణాలు కొరికేస్తూందే. పుగాకు పాయయినా లేదు..."

కనిపించని వేలుపుని కరుణించమని వేడుకుంటూ కొంగు అడ్డంగా పట్టుకుని నిలుచుంది. లచ్చి. వెంకాయ్ వెలిగించిన పుల్ల మండింది. మెల్లమెల్లగా కొబ్బరి పీచులో అగ్గిరగులు కోసాగింది.

"నిప్పు రాజేసి – నూకలుంటే రవంత గంజి తాగితే బాబు తేరుకుంటాడు."

"నీకు తెలియని నూక లెక్కడియి మావా? ఇయాళ... పాడు వాన... పనికి పోనిచ్చింది కాదు. మూలలన్నీ యెదిగితే నాలుగు జొన్న కంకులు దొరుకు తయ్యేమో?"

సుకుమారంగా పెరిగిన బాబే ! జొన్న కంకులెలా తినగలడే? గొంతు దిగొద్దూ?"

"మన మాటకేం గాని... ఆ బాబు కోసమైనా నాలుగు నూకలు మిగిల్చితే బాగుణ్ను. నిన్న పొద్దుటే కుండ ఖాళీ చేసేశాం..."

"మరిప్పు డెలాగే?"

"ఏటి మావా, నన్నడుగుతావ్... అసలే తికమక పడుతూ సతమతమై పోతున్నాను నేను... నేను నీకేటి సెప్పగలను? నిన్నటి నుంచీ మంచం మీద పడుండాడు బాబు. ఇయాళ తెలివొచ్చి ఆకలంటే... ఆ నోటి కేటందియ్యాలా అని ఆరాటపడి పోతున్నాను. ఇద్దరం మనుషులం ఉండి కూడా ఏటీ సెయ్యలేక పోతున్నాం... ఒక్క మనిషికి"

"నీ యెర్రి కాని మన సేతుల్లో యేటుందే? అంతా ఆ పరమాత్ముడి దయ. బగవంతుడు సల్లగా సూడాలి కాని... బాబు కేటీ బయం నేదే."

మూకుడులో నిప్పుచేసి నులక మంచం వద్దకు వచ్చింది లచ్చి. ముందు తన అరచేతులను వేడిజేసుకుంటూ శేఖరం శరీరానికి వెచ్చ దనాన్నందించ సాగింది.

లచ్చి అలా సెగ కాచుతూంటే... శేఖరం శరీరంలోని కీళ్ళన్నీ పట్లు వదిలి సడలిస్తున్నాయ్. బాధ అంతా మాయం కాసాగింది చేతితో తీసి వేస్తున్నట్లు బయటకు వ్యక్తీకరించలేని కృతజ్ఞతాభావం హృదయాన్ని ఆర్ద్రం కావించ సాగింది. కన్నీరు నిలుపుకోడం అతని తరం కాలేదు. ఆ కన్నులు ధారకట్టి వర్షించ సాగాయి.

"యేగంగా రెండు టీ చుక్కలు దొరికితే... బాబు కిద్దుము మావా?"

"అదే నేనూ సూత్తున్నానే. కుసింత యెసులు బాటిస్తే మొగదల కెళ్ళి ఎలాగో టీ పట్టుకుని పారొచ్చే వాడిని..."

"ఈ వర్షం విడవదంటావా మావా?"

"అదదాని యేడుపుకే యిరామ ముంటదే. అకాశానికి మాత్రం యిసుగెయ్యదూ? మింటికీ, మంటికీ ఏకధారగా నిన్నా యియాళా ఏకదాటిన మొత్తేసింది. సాయంత్రం అవుతూంది గదటే, ఓసారి తెరిపిస్తదేమో?

గుడిసె కావడాన అడుగునుంచి అడ్డులేకుండా వచ్చేస్తూంది యీదురుగాలి. వాన జల్లులు సరాసరి గుడిసెలోకే వస్తున్నయ్. కమ్మ నేయించి ఎన్నాళ్లయిందో! కప్పు చిల్లులుపడి గుడిసెలోకి ధారలు పడుతూంది వర్షపు నీరు.

శేఖరం వాళ్ల మాటలన్నీ వినగల్గుతూ వున్నాడు.

మోటు దేరిన లచ్చి అరచేతులు వెచ్చగా తన శరీరాన్ని స్పృశిస్తూంటే

అంతవరకూ అతని రక్తనాళాలలో గడ్డ కట్టుకుపోయిన రక్తం వెచ్చగా ప్రవహించ సాగింది. అతనిలోని బాధ మెల్లగా తగ్గుతోంది.

వెంకాయ్ గుడిసె బయటకు చూసేడు. వర్షం తగ్గు ముఖం పడుతుందేమో అని... చివరకు విసుగెత్తి పోయినట్లు – "ఇక... యిది తగ్గేది లేదుగానీ... సిల్లర డబ్బులుంటే యియ్యవే, టీ పట్టుకొస్తాను" అన్నాడు గోచీ బిగించుకుంటూ,

"సిల్లర లేదు కానీ... ఉండు మావా..." గబ గబ చూరులోంచి పాతగుడ్డల మూట నొకదాన్ని తెచ్చి – అ చిన్న మూటను విప్పింది.

"ఇప్పుడెందుకే యీ యిగ్రహం? మనసుపడి – మన పెళ్ళయిన మరుసటేడు – మన మిద్దరం వెళ్ళి తిరునాళలో కొనుకున్నాం గదటే? నేనంటే యెంత ప్రేమో, కృష్ణమూర్తంటే అంతబక్తి అన్నావు కూడాను. గ్యాపక ముందంటే?"

"అవునులే కానీ... ఇదట్టుకెళ్ళి సెట్టి కిచ్చెయ్. యిత్తడిదే అని చెప్పు, నాల్రూపాయలిచ్చి కొన్నాం. ఇప్పుడర్ధ రూపాయేనా యివ్వడూ?"

"ఏటోనే... ఈ బొమ్మ నమ్మడం నాకు బాగోలేదే లచ్చీ... మనసుపడి కొనుక్కున్నావ్..."

"అవసరంకంటె మన సెక్కువేటి మావా? బాబు కడుపెంత మండుతూందో? అకలంటూ కన్ను తెరిస్తే ఏంటందించేదా నోటికి?"

"సరేలేయే..."

"ఎళ్లి – యేగం తిరిగిరా చిటకలో, వర్షం... జాగర్త..."

"నేను చల్లబడినా టీ నీళ్ళను సల్ల బడనియ్యను లేయే ! జాగర్తగానే వస్తాలే."

"డబ్బులు చాలితే ఓ రొట్టే – గిద్దెడు నూకలూ, అగ్గిపెట్టె కూడా పట్టుకురా. యింకా మిగిలితే నువ్వు పుగాకు పాయ..." ఆత్రుతగా అంది లచ్చి – వర్షంలోకి దూసుకు పోనున్న వెంకాయ్ వంక చూస్తూ.

వారి మాటలన్నీ వింటున్న శేఖరం మనసు మరింత కరిగిపోసాగింది.

ఏం చేసి తీర్చుకోగలడు తను వారి రుణం?

ఎవరీ మనుషులు? ఎక్కడున్నాడు తను? వీళ్ళకింత దయయేమిటి తనమీద?

ఆ చెట్టుక్రింద... దెబ్బ తగిలి పడిపోయిన తనను ఉద్ధరించడానికి ఉద్భవించిన దేవతలు కారుకదా ఈ దంపతులు?

దారిపక్క యీ గుడిసెను - ఎప్పుడూ చూసిన గుర్తులేదే !

ఈ మనుషులను ఒకసారైనా చూశాడా తను గతంలో?

నేలమీద వాలి పోతున్న క్షణాలలో తన కంటికి యీ గుడిసె కనిపించలేదు. ఈ మనుషులూ కనిపించలేదు.

తన కళ్లనిండా కాటుకవంటి చీకటి ఆవరించుకుంది. తను కూలిపోతున్నది నేలమీదకు కాక సరాసరి మృత్యువు పరచిన వలలోకే అనిపించింది. నిరాశగా... నిస్పృహగా... నీరసంగా... అలా వాలిపోయాడు తను. తిరిగి... కన్ను తెరవగలడన్న ఆశేలేదా క్షణాల్లో. కాని... శాశ్వతమైన చీకటిని అంతరింప జేసి కాంతి నింపాయి ఈ రెండు దీపాలు: మృత్యువు వలలోకి జారిపోబోతున్న తనను నాలుగు చేతులాదుకుని జీవితాన్ని ప్రసాదించాయి.

వీరి దయవలన తను మళ్ళీ జీవితపు టెల్లలలోకి తీసుకు రాబడ్డాయి;

ఈ దీపాలు వెలుగు చూపకపోతే తను శాశ్వతంగా చీకటిలో మిగిలి పోయేవాడు.

ఈ హస్తాలు కాపాడకపోతే తను కాలగర్భంలో కలసి మరుగయ్యేవాడు.

చావుకి దగ్గరగా వెళ్ళి కూడా తను చచ్చిపోలేదు.

చీకటి అంచులలో అడుగు తడబడినా - తనకు వెలుగు దొరికింది.

రెండు దీపాలు... దారిపక్క దీపాలు; నాలుగు చేతులు... గుడిసెలోని నాలుగు చేతులు తనకు ప్రాణదానం చేశాయి !

జ్ఞాపకం వస్తోంది. చెట్టుక్రింద పడున్న తనను - నాలుగు చేతులు మోశాయి.

వీరిద్దరే తనను గుడిసెలోకి తెచ్చారు.

ఈ గుడిసెలో...ఎన్ని గంటలు గడిపాడో తను? అబ్బ !... నీరసం... ఆకలి...

వెన్నుమీద తగిలిన దెబ్బ - కదిలితే కలుక్కుమంటున్నాయ్ నరాలు.

అంతకంటె బాధ కొలుపుతూంది వాళ్ళిద్దరూ తవ కోసం ప్రదర్శిస్తున్న త్యాగం!

తన పెదవులకు వేడి టీ అందించడం కోసం - లచ్చి పెళ్ళయిన కొత్తలో కొనుకున్న యిత్తడి కృష్ణుడి బొమ్మను, దాంపత్యపు తొలిరోజుల మధురస్మృతులకు జీవితాంతమూ జ్ఞాపకంగా నిలిచే అమూల్యమైన చిహ్నాన్ని - అవలీలగా అమ్మకానికి పంపించి వేసింది!

ప్రాణాలకు తెగించి - తుఫానులో బయటకు పరుగెత్తాడు వెంకాయ్.

వీళ్ళెవరు? తనెవరు? వీరికి తనకూ సంబంధమేమిటి?

పరిచయంలేని పరాయి వ్యక్తి అయిన తనకోసం - లచ్చి చేత అంత త్యాగం చేయించ గల్గిన శక్తి ఏది? దారుణంగా కురుస్తున్న వర్షంలో తనకేమీ కాని వ్యక్తికోసం - ప్రాణాలు లెక్కచెయ్యకుండా పరుగెత్తి వెళ్ళిన వెంకాయ్ నలా చేయమని ప్రోత్సహించిన భావమేది? కేవలం మానవత్వమేనా?

"బా... బూ..." అప్యాయంగా, ఆత్రుతగా లచ్చి పిలుపు.

శ్రమపడి – కనురెప్పలను భారంగా పైకెత్తి చూసేడు శేఖరం.

తన ముఖం మీదకు వంగి చూస్తున్నదని గ్రహించగానే అతను మళ్ళీ కన్నులు మూసుకున్నాడు.

"మామ టీ కోసం యెళ్ళాడు. ఇంతలో యీ నీళ్ళు తాగండి... యీసారి వెచ్చ జేసి పట్టుకొచ్చాను."

"ఊ."

"లేచి కూర్చుంటారా బాబూ?"

"ఊ."

ఒక చేతిని అతని మెడ వెనుక వేసి – రెండో చేతితో వెన్నుకి ఆసరా యిస్తూ అతన్ని లేపి కూర్చోబెట్టింది. లచ్చి. గుడిసెలో వున్న పాతగుడ్డలూ, గోనె పరదాలూ కలిపి అతనికి బాలీసులా అమర్చి – గ్లాసుతో వేడి నీళ్ళందించింది.

రుచీ పచీ లేని ఆ నీళ్ళ నెలాగో చప్పరించాడతను.

కొంచెం ఓపిక వచ్చినట్లనిపించింది. "ఆ... క... లి..."

తల్లిడిల్లిపోతూ నలుమూలలా కలియ జూసింది లచ్చి.

శేఖరం విచిత్రంగా కన్నులు తెరచి చూపు కానినంత మేరా పరికిస్తున్నాడు.

అవతల వర్షం పడుతూనే ఉంది.

వికృతంగా అరచుకుంటూ గాలి వీస్తూనే ఉంది.

ఆ చిన్న గుడిసెలో... తాళ్ళు తెగిన చిన్న నులకమంచం మీద తను !

ఒక మూల మూడు యిటుకలతో అమర్చిన పొయ్యి. ఉదయం నిప్పు చెయ్యలేదు కాబోలు చలికి ముడిచిపెట్టుకుని పిల్లి పిల్ల ఒకటి అందులో పడుకుంది.

నేల గచ్చు చేయబడక పోవడాన చెమర్చి బురదగా వుంది.

మధ్య ఒక నిట్రాట. చుట్టూ నాలుగు రాటలు. ఏమీలేకపోవడాన అడ్డు లేకుండా వచ్చేస్తూంది గాలి. అప్పుడప్పుడు వర్షపు జల్లులు.

అమూల... ఉట్టిమీద ఒక అన్నం చట్టి. దాని దిగువ రెండు కుండలు. బహుశా వాటిలో వర్షపు నీరు నిండి వుందేమో ! దారిద్ర్య చిహ్నాలలా స్థిరంగా వున్న ఆ రెండు కుండలకూ కొంచెం ప్రక్కగా కన్నీరు కారుస్తున్న కన్నులలా నీళ్ళోడుతున్న రెండు కట్టెలు. అడవి కర్రలయ్యుంటాయవి. నల్లగా మెలి తిరిగిన ఆ కర్రలు – చావ సిద్ధంగా ఉన్న నల్ల త్రాచుల్లా ఉన్నాయ్.

ఇందాక తన పెదవులకు నీరందించిన జర్మన్ సిల్వర్ గ్లాసు – నేల మీద గాలికటూ యిటూ కదులుతూ మకిలితో పాటు బురదను కూడా అంటించు కుంటూంది.

చూరులో వ్రేలాడుతున్న రెండు జొన్న కంకులు మినహా ఆ గుడిసెలో తినదగిన వస్తువేమీ లేదేమో?

ఈ మనుషులు మానసికంగా ఎంత ఉన్నతులో ఆర్థికంగా అంత లేనివారు. పేదరికం వీరి బ్రతుకునిండా ఆవరించుకుంది;

ఏం చూసుకుని బ్రతుక గల్గుతున్నారీ మనుషులు? వీరిలో ఆశలు - ఆ ఆశలకు ఆధారాలు - అంటూ ఉన్నయ్యా? ఏ వసంతం తొంగి చూస్తుందని కలలు కంటూ - మండుటెండవంటి బాధాకరమైన వర్తమానాన్ని తరించ గల్గుతున్నారు?

ఊరిబయట... సుఖాలకు నోచుకోకుండా...

ఈ శాపదగ్ధ జీవితాలలో అర్ధమూ, ప్రయోజనమూ ఏమిటి? ఎందుకీ బ్రతుకులు? ఎవరికోసం?

ఎంత వింత అనుభవం ఎదురైంది తనకు! ఈ పేద మనుషుల నడుమ - దుర్భరమైన దారిద్ర్య పంజరంలో - విపత్కరమైన స్థితిలో - విలయ తాండవం చేస్తున్న వర్షంలో - ఇక్కడ ఎన్నో గంటలు గడిపాడు తను ! కాఠిన్యమూ, క్రూరతా నిండిన యీ జీవన చిత్రపు నగ్నరూపం తనకెందుకు కనిపించినట్లు? నిర్దయతో కూడిన యీ సంఘటన తనకు బోధించాలను కంటున్న విషయమేమిటి? తనవంటి ఆగర్భ శ్రీమంతుడికి - జీవితం తాలూకు రెండవ ప్రక్క చిత్రం ఎందుకిలా సాక్షాత్కరించింది?

ఇటువంటి బ్రతుకుల గురించి ఆలోచించ లేకపోవడమూ - ఆరిపోబోయే దీపాలవంటి మనుషులను ఉద్ధరించడానికి ప్రయత్నించకపోవడమూ - గతంలో తన నిర్లక్ష్యతకు - యిప్పుడు తన అంతరాత్మ ముందు తన నేరస్థుడిలా తలదించు కుంటున్నాడు! ఈ మనుషులు !... వీరి మనసుల నిండా మానవత్వం, గుండెలనిండా దయ, మాటలనిండా మమతలు, హృదయాలనిండా త్యాగం ! ఈ సుగుణాలు కావూ తనను ఆపదనుంచి ఆదుకున్నవి? ఏం చేస్తే తీరుతుంది వీరి ఋణం?

శేఖరం త్రుళ్ళిపడి చూశాడు. నేలమీద - బురదలో - పొరాడుతున్న పసిపాప క్యారు మన్నాడు.

లచ్చి వెళ్ళి వాడిని గుండెల కదుముకుంది...

ఆమె గుండెలు చీకుతున్న ఆ పసిపాపను చూసే సరికి శేఖరంలో ఆకలి విజృంభించింది.

"ఆ... క... లి..."

తడబడిపోతూ పరుగెత్తి జొన్నకంకులు రెండూ నిప్పుకాల్చి పొట్టుతీసి తెచ్చింది.

"రొట్టి... టీ... తీసుకు రమ్మని మావను తోలేను. గడియో క్షణమో వొస్తాడు."

కంకులు అందిస్తూనే గుడిసె బయట ఆరాటంగా తొంగి చూసింది లచ్చి.

మెల్లగా నములుతూ కూర్చున్నాడు శేఖరం. అతని ఆకలి క్షణ క్షణమూ అధిక మౌతూంది.

పాలు తాగుతూ బొజ్జ నింపుకుంటున్న పసిపాపను చూస్తున్న కొద్దీ అతనిలో అసూయ కలిగిపోతూంది అపుకుందా మన్నా ఆగక.

"ఇంకా రాడేం నీ మావ?" చిరాకు పడిపోతున్నాడు శేఖరం. ఆకలి అతని యుక్తాయుక్త విచక్షణా జ్ఞానాన్ని నశింపజేస్తూంది. ఆ బలహీనతలో అతనికి తెలియడం లేదు; తల్లి రొమ్ములను అవాటుగా చీకుతున్నాడే తప్ప పసిపాప పొట్టలోకి పాలచుక్కలు నిండటం లేదని.

లచ్చి ఆత్రుతగా కాలు కాలిన పిల్లిలా అటూ యిటూ తిరుగుతోంది.

ఇంకా మామ టీ తీసురాడేం? ఒకటే ఆరాట పడిపోతూంది.

బాబు ఆకలితో తలకిందులై పోతున్నాడు. ఏం చేయడం?

ఆశలన్నీ కన్నులలో నింపుకుని అవతలకి చూస్తుంది లచ్చి.

నిర్దాక్షిణ్యంగా వర్షం కురుస్తూనే ఉంది. విసురుగా యెదురు గాలి కొడుతూనే ఉంది.

శేఖరం ఆకలి బాధకు ఓర్వలేక పోతున్నాడు. ఆకలిలో ఉన్న దుర్గణమే అది. కడుపులో ఏమీ పడనంతసేపు బాధ ఉండదాట్టే. ఒక కబళం దొరికిందా పట్టపగ్గాలు లేకుండా విజృంభిస్తుంది. లచ్చి తిండితిని రెండు పూటలు దాటిందనీ - పసిపాప కంటె అన్యాయమై - ఆమె గుండెల మీది పాపవంక అసూయగా చూస్తున్నాడు.

లచ్చి వొళ్ళు - అచ్ఛాదనలేని ఆమె గుండెలు... చలికి వణుకుతున్నాయి.

ఆమె గుండెలలో తల దాచుకోవాలని... ఆమె స్పర్శలోని సాంతనతో సుఖపడాలని తహతహలాడుతున్నాడు శేఖరం బలహీనంగా.

అతని కదలికకు మళ్ళీ నులకతాళ్ళు కిరకిర లాడేయి. అతని నరాలు కటక్కుమన్నాయ్.

"లచ్చీ" గొంతు చించుకోగా - అస్పష్టంగా బయట పడింది పిలుపు.

లచ్చి అతని వంక పరుగెత్తుకు వచ్చింది. అవతల ఏకధారగా వర్షం. చాలా చీకటి.

గుడిసెలో గుండెలు జలదరింప జేసే చలి. మసక వెలుగు.

లచ్చిలో ఆరాటం. ఆవేదన. శేఖరంలో ఆకలి... చలి...

అనిర్వచనీయమైన సంఘర్షణ అక్కడ ఆ మనుషులలో

"మావ టీ తెస్తాడు బాబూ... పుచ్చుకుందురు గాని..."

పైశాచిక శక్తి ఒక్కసారిగా విజృంభించింది శేఖరంలో. ఊహించని లచ్చి బురదలో కాలుజారి పడింది. ఆమె రొమ్ములు అనాచ్ఛాదితాలై ఉన్నాయి. ఆమె కన్నులు మాత్రం యింకా స్వచ్ఛంగా ఉన్నాయి.

శేఖరం కళ్ళు - ఆ భావాలు... మాటల కందనివి.

ఎక్కడో ఉరుములు... మెరుపులు పిడుగులు... ఎడతెగని వర్షం. విరామం లేని గాలులు.

విలయ తాండవం చేస్తున్నాయి ప్రకృతి శక్తులు.

తుఫానులో నావల మాదిరి - భావ సంఘర్షణలో లచ్చీ, శేఖరమూ.

"బా... బూ..."

త్రుళ్ళిపడి చూశాడు శేఖరం. పరిచితమైన ఆ పిలుపు వినగానే ఆనందంతో అతనిలో శక్తి కలిగింది. "డ్రైవర్..."

"నిన్నటి నుంచీ మీ కోసం వెదుకుతూనే ఉన్నాం బాబూ..."

"ఆ... క... లి..."

డ్రైవర్ ఫ్లాస్కులోంచి కాఫీ పోసి యిచ్చాక - శేఖరం మామూలు మనిషైపోయాడు. అతని నరాలు కుదుట పడ్డాయ్. మెల్లగా లేచి నిలుచున్నాడు. లచ్చీ, డ్రైవరూ అతనికి చేయూత నిచ్చారు.

"అమ్మగారు చాలా కంగారు పడిపోతున్నారు బాబూ ! కారు కనిపించింది... మీ కోసం పొద్దుటి నుంచీ వెదుకుతూనే ఉన్నాను."

"ఇంటికి... పోదాం... కారు..."

ఇంతలోనే నీరు కారుతున్న వొంటితో - ఒక అరచేతిని గ్లాసు మీద మూసి - టీ పట్టుకు వచ్చాడు వెంకాయ్ "టీ బాబు"

"నీ టీ ఎవరికీ అక్కరలేదు కానీ – అవతలపెట్టి సాయంచెయ్... బాబును కారులో చేర్చుదాం..." తను కప్పుకున్న రెయిన్‌కోటును శేఖరం భుజాల మీద పరచి అన్నాడు డ్రైవర్.

శరీరానికి కొంచెమైనా బాధకలుగ కుండా... వంటిమీద ఒక చుక్కయినా వర్షం పడకుండా వారి భుజాలమీద కారులోకి చేర్చబడ్డాడు శేఖరం.

"ఏమిటీ దుర్వాసన?" అసహ్యాన్ని సూచిస్తూ అడిగాడు శేఖరం.

"రోడ్డుపక్క లాక్ చేయడం మరిచిపోయి కారు వదిలేశారు బాబూ ! తేరగా దొరికిందని యిందులో ఊరకుక్క ఒకటి పిల్లలను పెట్టింది. నేను వచ్చేసరికి ఎవరో దౌర్భాగ్యులు సీటు మీద ముడిచి పెట్టుకు పడుకున్నారు. కుక్కను తరిమేసి – ఆ దౌర్భాగ్యులను పొమ్మని – కారు శుభ్రంచేసేను బాబు ! ఆ వెధవలకి కారు విలువ ఏం తెలుస్తుంది బాబూ?"

పక్కనే నిలుచున్న వెంకడి కన్నులలో నీరు తిరిగింది.

"త్వరగా పోదాం బాబూ... ఓపిక పట్టండి..." అంటూ కారు స్టార్ట్ చేశాడు డ్రైవర్.

"ఊ" హుందాగా ఆజ్ఞాపించాడు శేఖరం. కారు కదిలింది.

డ్రైవరు విసిరిన రూపాయ కాసును వెంకాయ్ చూడనే లేదు.

కారు కదులుతూంటే వెంకాయ్ వెనుకపడి పోతున్నాడు.

బురదలో జారిపోతూంది కారు. కారులో కుషన్ సీటు మీద సుఖంగా వెచ్చగా శేఖరం. కారు చక్రాలక్రింద... బురదలో కుక్కపిల్లలు నలిగిపోతున్న సంగతి అతనికి తెలియడం లేదు. గుడ్డు తెరవని కుక్క పిల్లలు... అరవకుండానే అంతమూ ఐపోయాయ్ బురదలో.

అక్కడ... గుడిసెలో... వెంకన్నతెచ్చిన టీ – లచ్చి కారుస్తున్న కన్నీరు పడి చప్పగా చల్లారి పోతూంది. ఆమెలో అపరిమితమైన ఆవేదన. వెంకన్న గుండెలో ఎందుకో కలవరం.

ఇవేవీ గమనించడం లేదు శేఖరం. కుషన్ సీటుకు ఆనుకుని సుఖంగా కూర్చున్నాడు ఇప్పుడతని ఆలోచనలన్నీ తన యింటిపై... శ్యామల మీద... సుఖాల మీద.

వర్షాన్నీ బురదనీ లెక్కచెయ్యకుండా కారు పోతూంది ముందుకి.

దారి పక్క దీపాలు... జాలిగా... బాధగా... ఓడిపోతూ జారిపోతున్నాయి వెనక్కి... వెనక్కి... వెనక్కి

**(1968లో ఆంధ్ర విశ్వసాహితి, సికిందరాబాద్ వారి కథల పోటీలో ప్రథమ బహుమతి పొందినది. ఆంగ్లములోకి అనువాదమూ, రేడియో నాటికగానూ కూడా)**

✡ ✡ ✡ ✡ ✡